సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 16 । ఆగస్టు । 2023



గణేశ్‌కు అవకాశం కల్పించాలి

తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా వద్దిరాజు గణేష్‌కు ప్రాతినిథ్యం కల్పించాలని మంత్రి కేటీఆర్‌కు బ్రాహ్మణ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. - 8లో



రెగ్యులరైజ్ చేయాలి

వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు సమ్మె చేపట్టారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33^0/25^0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వచ్చే నెల 4న సీఎం రాక



హసన్‌పర్తి: వచ్చే నెల 4న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హనుమకొండ జిల్లాకు రానున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని దేవన్నపేట–ఉనికిచర్ల ప్రాంతాల్లో సభ నిర్వహించడానికి అనువైన ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరిశీలించారు. సీఎం ఆ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ సందర్భంగా సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను మంత్రి ఎర్రబెల్లి పరిశీలించారు. మంత్రి వెంట ఆర్డీఓ రమేష్, మాజీ సర్పంచ్ రవీందర్, ఆత్మ డైరెక్టర్ భూపాల్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నేడు కేయూ బంద్

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం పిలుపుమేరకు బుధవారం కాకతీయ యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆ అసోసియేషన్ జాక్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 100 రోజులుగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలోనూ పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లకు అకుట్, పార్ట్‌టైం అధ్యాపక, వివిధ విద్యార్థి సంఘాలు మద్దతునివ్వాలని కోరారు.


వైన్స్ దరఖాస్తులకు అధిక మాసం ఎఫెక్ట్

కాజీపేట అర్బన్ : వరంగల్ అర్బన్ జిల్లాలో 65 వైన్స్‌కు ఆబ్కారీ శాఖ ఈనెల 4న టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. దరఖాస్తులను ఈనెల 4 నుంచి 18 వరకు స్వీకరించేందుకు ప్రక్రియ ప్రారంభించింది. కాగా దరఖాస్తుల స్వీకరణ 11 రోజులకు 1,400 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ ఏడాది అధిక మాసం రావడంతో ఆషాఢం మాదిరిగానే అధిక శ్రావణమాసం ఎఫెక్ట్ వైన్స్ దరఖాస్తులపై పడిందని స్పష్టమవుతోంది. దరఖాస్తులకు అప్లికేషన్ ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించేందుకు, దరఖాస్తులు సమర్పించేందుకు దరఖాస్తుదారులు శుభముహూర్తాన్ని ఎంచుకుంటారు. అధిక మాసం రావడంతో దరఖాస్తులు అందించేందుకు వెనుకంజ వేస్తున్నారనే చర్చ కొనసాగుతోంది.

నేటితో ముగియనున్న అధికశ్రావణం


జూలై 18న ప్రారంభమైన అధిక మాసం బుధవారంతో ముగియనుంది. 17 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండగా వైన్స్ దరఖాస్తులు జోరందుకునే అవకాశం ఉంది. అదే విధంగా చివరి రోజు శ్రావణమాసం మొదటి శుక్రవారం రావడంతో అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేందుకు ముహూర్తాలను ఫిక్స్ చేసుకుంటున్నట్లు సమాచారం. గతేడాది 2,983 దరఖాస్తులకు రూ.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ రికార్డు ఈ నెల 17,18వ తేదీల్లో బ్రేక్ అయ్యే అవకాశం ఉంది.

సీఎం చేతుల మీదుగా ఏఎస్ఐ సంపత్‌కు అవార్డు



రామన్నపేట : ఇటీవల నగరంలో సంభవించిన వరదల సమయంలో సహాయక చర్యలు చేపట్టి పలువురిని రక్షించడంతోపాటు విధుల్లో నిబద్ధతతో వ్యవహరించిన మట్టెవాడ ఏఎస్ఐ సంపత్‌కు అరుదైన సత్కారం లభించింది. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా సంపత్ స్పెషల్ అవార్డు అందుకున్నారు.

నగరానికి నేపాల్ మేయర్‌ల బృందం



వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో శానిటేషన్ విధానాల అధ్యయనానికి నేపాల్‌కు చెందిన 26 మందితో కూడిన మేయర్ల బృందం మంగళవారం సాయంత్రం వచ్చింది. బృందం సభ్యులు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కొత్తగా అమలుచేస్తున్న విధానాలపై మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాలతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హనుమకొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, పక్కన కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్



ప్రగతి వైపు పయనం

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- పల్లె పల్లెనా అభివృద్ధి ఫలాలు
- 'మన ఊరు మన బడి' ద్వారా 176 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- హనుమకొండ పంద్రాగస్టు వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రసంగిస్తున్న వినయ్‌భాస్కర్

వరంగల్ క్రైం: ఉద్యమించి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో హనుమకొండ జిల్లా ప్రగతి వైపు వేగంగా పయనిస్తోందని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 77వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసుల పరేడ్‌ను తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు ఒకే దగ్గర అందాలన్న సంకల్పంతో హనుమకొండ సుబేదారిలో నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మించారని, ఇది జిల్లా కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలిచిందన్నారు.

రైతు అభ్యున్నతి దిశగా..

రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పర్యాయాలు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు బీమా కింద ఈ ఏడాది 307 రైతు కుటుంబాలకు రూ.15.35 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ ఏడాది మార్చిలో కురిసిన భారీ వర్షాల కారణంగా 6,200 ఎకరాలలో పంట నష్టానికి 7,340 మంది రైతులకు రూ.6.20 కోట్లు అందించినట్లు తెలిపారు. గత ఏప్రిల్‌లో కురిసిన వడగండ్ల వాన కారణంగా 9,749 ఎకరాల్లో పంట నష్టం జరగగా రూ.9.74 కోట్ల నష్టపరిహారం అందించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు.

విద్య, పారిశ్రామికరంగం..

మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా 176 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో 30 రకాల పరిశ్రమల అభివృద్ధికి ఈఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకోగా రూ.636 కోట్ల పెట్టుబడితో వివిధ రకాల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 2023–2024 ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటికే 13.82లక్షల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. దీనికి గాను లబ్ధిదారులకు రూ.29.61 కోట్లు అందించారన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారన్నారు. జిల్లాలో 1,06,351 మంది పింఛన్‌దారులకు ప్రతినెలా రూ.24.15 కోట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రకాళి దేవాలయంలో పర్యాటక, మౌలిక సదుపాయాల కింద రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. దళిత బంధు కింద ఇప్పటివరకు 4,182 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.9.90 లక్షల చొప్పున రూ.400.14 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు.

ప్రభుత్వాస్పత్రులపై పెరిగిన నమ్మకం

రాష్ట్ర ఆవిర్భావం తరువాత ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరిగిందని వినయ్‌భాస్కర్ అన్నారు. కంటి వెలుగు –2 కార్యక్రమంలో 4,12,655 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 61,730 మందికి రీడింగ్ కళ్లద్దాలు అందించినట్లు చెప్పారు. రూ.2.40 కోట్లతో ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో టీ డయాగ్నస్టిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో 134 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జెండా వందనం చేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా

అర్హులందరికీ ఇళ్లు

జిల్లాకు 4,480 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2,051 గృహాలు పూర్తి కాగా మిగిలినవి ఈ ఏడాది చివరి నాటికి పూర్తి కానున్నాయన్నారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాకు 8,400 గృహాలు కేటాయించారన్నారు. దీంతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ పురోగతిలో ఉందని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ తెలిపారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

వివిధ పాఠశాలల విద్యార్థులు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, జాతీయ భావం, సమైక్యత అంశాలపై నిర్వహించిన ప్రదర్శనలు జాతీయ స్ఫూర్తిని పెంపొందించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, స్వాతంత్య్ర సమరయోధులు, జిల్లా ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పక్కన కలెక్టర్ ప్రావీణ్య



సంక్షేమం దేశానికి ఆదర్శం

మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్య్రం

- నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఏర్పాటు
- వరంగల్ పంద్రాగస్టు వేడుకల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- ఐడీఓసీ స్థలంలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం

కరీమాబాద్ : 'ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్య్ర సాధించుకున్నాం.. ఆ త్యాగమూర్తులు ఆశించిన నవ భారత నిర్మాణంలో ప్రతి భారతీయుడు భాగస్వాములు కావాలి' అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పిలుపునిచ్చారు. వరంగల్ ఐడీఓసీ నిర్మాణ స్థలంలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారని చెప్పారు. అలాంటి త్యాగమూర్తులకు జోహార్లు అని పేర్కొన్నారు. 1947 ఆగస్టు 15న భారతదేశం సార్వభౌమ దేశంగా హోదా సాధించుకుందని గుర్తుచేశారు. ఈక్రమంలోనే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న విజయాలు మనందరికి గర్వకారణమని తెలిపారు. సంక్షేమ రంగంలో తెలంగాణ స్వర్ణయుగాన్ని లిఖించిందని పేర్కొన్నారు.

పథకాలు దేశానికి ఆదర్శం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత కరెంట్, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, గేదెలు, గొర్రెలు, చేప పిల్లలు, పోడు భూములకు పట్టాల పంపిణీ, కులవృత్తుల వారికి ఆర్థిక సాయం, ఆత్మగౌరవ భవనాలు, ఎస్సీ, ఎస్టీల ఇళ్లతోపాటు సెలూన్లకు ఉచిత విద్యుత్ పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా గిరిజన తండాలు, గ్రామ పంచాయతీలు, గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బ్రాహ్మణుల ఉన్నత విద్యకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి ప్రతిష్టాత్మక పథకాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షమే పథకాలను దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని తెలిపారు. వేడుకల్లో ఎంపీ పసునూరి దయాకర్, కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ రంగనాథ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, అరూరి రమేష్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్వినితానాజీ వాకడే, డీసీపీ రవీందర్, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు డీసీపీ సురేష్ , ఆర్డీఓ వాసుచంద్రతోపాటు ఏసీపీలు బోనాల కిషన్, తిరుమల్, సతీష్‌బాబు, రమేష్‌కుమార్, కిశోర్‌కుమార్, భోజరాజు, సీఐలు పుల్యాల కిషన్, ముస్క శ్రీనివాస్, సురేష్, వెంకటేశ్వర్లు, మల్లేష్, మహేందర్, శ్రీనివాస్, రామకృష్ణ, క్రాంతికుమార్, హతీరాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల గౌరవ వందనం..

స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో డాక్టర్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్ ఉన్నారు.

సమరయోధులకు సన్మానం..

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సమరయోధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం సిద్ధించడంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. స్వాతంత్య్ర సమరయోధులను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న బండా ప్రకాశ్

జెండాకు సెల్యూట్ చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే రమేశ్

అలరించిన చిన్నారుల నృత్యాలు..

వరంగల్ ఆజంజాహి మిల్స్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. దేశభక్తి పాటలకు వారు నృత్యాలు చేశారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు..

విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభ, సమయస్ఫూర్తికి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. అందులో భాగంగా జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన 189 మందికి మండలి బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు.

స్టాళ్ల సందర్శన..

వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేకార్షణగా నిలిచాయి. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు తెలిసేలా స్టాళ్లు ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు.



ఉత్తములకు అవార్డులు

- వివరాలు 8లో

కమిషనరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సీపీ చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, రవీందర్, అబ్దుల్ బారీ, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




చిన్నారులతో సీపీ రంగనాథ్, పోలీస్ అధికారులు

నిబంధనలకు లోబడే పోలీస్ పోస్టింగ్‌లు

కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడే వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్‌లు జరిగాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని 21 మంది పోలీస్ అధికారులకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల కమిషన్ జూన్ 2 నాటికి అధికారుల బదిలీలకు గడువు ఇచ్చిందని, దానికి కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే బదిలీలు జరిగాయని వివరించారు. ఫిర్యాదులు వచ్చిన 21 మంది అధికారుల పోస్టింగ్‌లు సైతం నిబంధనలకు లోబడే చేసినట్లు సీపీ తెలిపారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: ఐక్యఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లోని ఉద్యోగుల, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ బద్దం వెంకటరెడ్డి, ఉభయ జిల్లాల కమిటీ బాధ్యులు సి.సుజన్‌ప్రసాద్‌రావు, సిహెచ్.లింగారావు, కె.రమేష్, సీఎస్ఆర్ మల్లిక్, ఎన్.శ్రీనివాస్, డి.రవీందర్, నీలాద్రి పాల్గొన్నారు.

గ్రేటర్‌లో త్రివర్ణ పతాకావిష్కరణ

సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ : మేయర్

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. మేయర్ గుండు సుధారాణి జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధన కోసం అమరులైన వీరులకు నివాళులర్పిస్తూ ఆనాటి ఉద్యమకారులకు, ప్రముఖులకు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, జన్ను శిభారాణి, అరుణ్, బస్వరాజు శిరీషా, వల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, నల్లా స్వరూపారాణి రెడ్డి, గుండు చందన, మరుపల్లి రవి, సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి, పోశాల పద్మ, రామా తేజస్వీ, వేముల శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్, వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బల్దియా ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మేయర్ సుధారాణి

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



మౌత్‌వాష్, పేస్టులు అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని ఎస్‌వీఎస్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గిరిధర్‌రెడ్డి పాల్గొని పలువురికి పరీక్షలు చేశారు. ఉచితంగా పేస్టులు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. దంత సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన ఆర్య నాటిక



నాటికలోని ఓ సన్నివేశం

హన్మకొండ కల్చరల్ : 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి ఆధ్వర్యంలో సోల్జర్ షఫీ మహమ్మద్ రచించి దర్శకత్వం చేసిన ఫ్రీడమ్ ఫైటర్ నీరా ఆర్య నాటిక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మంగళవారం రాత్రి పోతన విజ్ఞాన పీఠంలో నాట్యమండలి అధ్యక్షుడు జేఎస్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో సురభి హారిక, రేలారే శాలిని, జూలూరి నాగరాజు, సుధాకర్, అశోక్‌కుమార్, మధు, విజయారాజ్, సురేష్, లింగమూర్తి, రవికుమార్, శివ, సంగీతం సురభి నాగరాజు, లైటింగ్, సెట్టింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ రాజశేఖర్, ఎక్స్‌సోల్జర్ మనోజ్ ప్రభాకర్, బిట్ల వేణుగోపాల్, సుబేదార్ మల్లేశాన్ని సన్మానించారు.

ముగిసిన కార్తీక్ అంత్యక్రియలు



కార్తీక్ (ఫైల్)

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కొలుగూరి కార్తీక్ (31) శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. కాగా, ఆర్మీ అధికారులు ఉత్తరాఖండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కార్తీక్ పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మండల కేంద్రానికి తరలించారు. మంగళవారం సాయంత్రం కొనసాగిన కార్తీక్ అంతమయాత్ర రాత్రి 9.30లకు ముగిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కడసారి వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, కార్తీక్ పార్థివదేహం మండల కేంద్రానికి చేరుకోగానే భార్య ప్రవళిక బంధువులతో కార్తీక్ కుటుంబ సభ్యులకు గొడవ మొదలైంది. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు



చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాస్

విధి నిర్వహణలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కనబరిచిన ప్రతిభ, సమయస్ఫూర్తిని ప్రశంసించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. హనుమకొండలో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్‌లో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, ఆయా శాఖల జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. - వరంగల్ క్రైం/కరీమాబాద్



సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ | జి. రాంరెడ్డి, డీడీ, బీసీ వెల్ఫేర్ | హర్షవర్ధన్, డీఈఈ, ఇరిగేషన్ | డాక్టర్ కాళీప్రసాద్, గార్డియన్ ఆస్పత్రి



శేషుమాధవ్, కృష్ణ పీడియాట్రిక్ ఆస్పత్రి | దిలీప్‌కుమార్, కీర్తి చిల్డ్రన్ హాస్పిటల్ | డాక్టర్ జి. నరేందర్, సోషల్ వర్కర్ | సంతోష్, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | కె.శంకర్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | అమరేందర్, సీసీ, అడిషనల్ కలెక్టర్ | సీహెచ్ రాము, డ్రైవర్, కలెక్టరేట్ | ఎస్.ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్ | సదయ్య, తోటమాలి | ఓం ప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్, అడిషనల్ కలెక్టర్ | ఆర్.శేఖర్, ఆఫీస్ సబార్డినేట్, ఆర్డీవో హనుమకొండ | దశరథరాంరెడ్డి, గిర్దావర్, కాజీపేట



ప్రశాంత్, టైపిస్ట్, కమలాపూర్ | డాక్టర్ శ్రీధర్, బాలాజీ హాస్పిటల్ | ఆయుబ్ అలీ,పీఆర్‌ఓ, జీడబ్ల్యూఎంసీ | సంగీత, సీనియర్ అసిస్టెంట్, ఈఎస్‌ఐ హాస్పిటల్ | ఎస్.కె యాకూబ్ అలీ, ఎంఎన్‌ఓ, ఈఎస్‌ఐ హాస్పిటల్ | దిలీప్, మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | ఎ.రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్, టీఎస్ఎన్పీడీసీఎల్ | ఆర్.అశోక్‌రెడ్డి, పైలట్, 108 | భిక్షపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్, క్వాలిటీ కంట్రోల్ బోర్డు | రమేష్, బ్యాడ్మింటన్ కోచ్, డీవైఎస్‌ఓ | ఎండీ అఫ్జల్, క్రికెట్ కోచ్, డీవైఎస్‌ఓ | కంచి వేణు,ఎంవీఐ, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్



బండా ప్రకాశ్ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి

వరంగల్ జిల్లాలో ..



పుష్పలత, బీసీ అభివృద్ధి అధికారి | బాలకృష్ణ, జిల్లా వెటర్నరీ అధికారి | విశ్వనారాయణ, సూపరింటెండెంట్ | డి.సృజన, సీనియర్ అసిస్టెంట్



జి.సారంగం, ఆఫీస్ సబార్డినేట్ | జి.మధుసూదన్, నయాబ్ తహసీల్దార్ | సీహెచ్ రఘు, జూనియర్ అసిస్టెంట్ | కె.నవీన్‌కుమార్, ఎస్సై | ఎస్.కిరణ్మయి, ఎస్సై



హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ | సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ | కె.బాబు, రికార్డు అసిస్టెంట్ | ఎండీ.ఆరీఫ్‌అర్షద్, ఎస్సై | బి.రమేష్, హెడ్ కానిస్టేబుల్ | ఎల్.జితేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ | గుగులోతు సువర్ణ, ఎస్సై | జి.లింగస్వామి, కానిస్టేబుల్ | మోహన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ | జి.సోమ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ | ఎ.శ్రీనివాసరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ | ఎండీ.అక్తర్, ఫైర్‌మన్

పాముకాటుతో యువకుడి మృతి

- ఇబ్రహీంపూర్‌లో ఘటన



మహేష్ (ఫైల్)

రఘునాథపల్లి: పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దొరగొల్ల ఎల్లయ్య, లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు మహేష్ (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులకు చేదోడువాడుగా ఉండే మహేష్ మంగళవారం గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. గ్రామ పెద్ద చెరువు కట్ట చివరన గొర్రెలను మేపుతుండగా మహేష్‌కు పాము కాటువేసింది. తనకు పాము కాటువేసినట్లు స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. ఘటనా స్థలిలోనే అస్వస్థతకు గురైన మహేష్‌ను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే మహేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మధుకర్ మృతదేహం

ఎల్కతుర్తి : అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన పెండ్యాల మధుకర్ (35) వ్యవసాయం, కుటుంబ అవసరాల నేపథ్యంలో విరివిగా అప్పులు చేశాడు. ఎలా తీర్చాలని కొంత కాలంగా మదనపడుతున్నాడు. ఈ విషయమై సోమవారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మధుకర్ వ్యవసాయ పొలం వద్ద మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు.

చిన్నారిని ఢీకొన్న కారు

- పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నందిని

గూడూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ చిన్నారిని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆ బాలిక పరిస్థితి విషమంగా మారింది. మండలంలోని మర్రిమిట్టకు చెందిన చింత నర్సయ్య, హేమలత దంపతుల కూతురు నందిని ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎన్‌హెచ్‌కు పక్కన ఉన్న పాఠశాల నుంచి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో నర్సంపేట వైపు నుంచి వస్తున్న భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన కారు బాలికను ఢీకొంది. దీంతో గ్రామస్తులు వెంటనే బాలికను వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కారుతో పాటు అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

సమాజహితానికి కవులు కృషి చేయాలి

- డాక్టర్ అంపశయ్య నవీన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న అంపశయ్య నవీన్

హన్మకొండ కల్చరల్ : సమాజహితానికి కవులు కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. మంగళవారం హనుమకొండ పద్మాక్షి దేవాలయం రోడ్‌లోని డాక్టర్ జగదీష్‌బాబు ఆస్పత్రి సమావేశపు హాల్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మతసామరస్యం, జాతీయ సమైక్యతకు ప్రతీకగా గంగా, జమునా, తెహజీబ్ పేరుతో కవిసమ్మేళనం, ముషాయిరా నిర్వహించారు. వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 40 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. అనంతరం నిర్వాహకులు సిరాజుద్దీన్, రవికుమార్ కవులను సన్మానించారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

'తూర్పు' నుంచి గణేశ్‌కు అవకాశం కల్పించాలి

- మంత్రి కేటీఆర్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రామన్నపేట/హన్మకొండ: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు గణేష్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమ శాఖ మంత్రి కేటీఆర్‌కు బ్రాహ్మణ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్‌ను బ్రాహ్మణ సంఘాల నాయకులు కలిశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించాలని, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వరంగల్ జిల్లాలో బ్రాహ్మణ జాతిని ఏకతాటి పై తీసుకువచ్చిన వద్దిరాజు గణేష్‌కు వరంగల్ తూర్పు టికెట్ కేటాయించాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ, జగన్‌మోహన్ శర్మ, లక్ష్మణ్ శర్మ, వెంకటేశ్వరరావు, సత్యమోహన్, శ్రీనివాసాచారి, పి.శ్రీనివాసరావు, శ్రీకాంత్, శరత్, శిరీష్, నాగేందర్, జయప్రసాద్ రావు, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..

- శిల్పాల ప్రాంగణంలో ఎగరని జాతీయ జెండా
- పర్యాటకుల అసహనం



మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో బోసిపోయి కనిపిస్తున్న స్తంభం

ఖిలా వరంగల్ : కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని స్తంభం వెలవెలబోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్తంభంపై స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. కేవలం రాతి కోట ఉత్తర ద్వారా సమీపంలోని కోట బురుజుపై పురావస్తుశాఖ అధికారి తాత్కాలిక జెండా చేతపట్టి ఫొటోలు దిగారని పలువురు జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. కాగా, మంగళవారం వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు దేశ, విదేశీయులు పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకోగా బోసిపోయి కనిపించిన ఎత్తయిన జెండా స్తంభాన్ని చూసిన వారు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర పురావస్తుశాఖ.. రాష్ట్ర సూపరింటెండెంట్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు

ఎంజీఎం : వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాల ఎదుట ఏఎన్‌ఎంలు సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లడుతూ రెండో ఏఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్‌ఎంలు, యూరోపియన్ ఏఎన్‌ఎంలు, ఇతర అన్ని స్కీంలలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు రెండు దశాబ్దాలుగా రెగ్యులర్ కాకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమ్మెకు అన్ని ట్రేడ్, క్యాడర్ యూనియన్లు పద్దతుగా నిలిచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభావతి, సరోజ, నర్మద, విజయలక్ష్మి, రోజీ, వరలక్ష్మి, సునీత, విజయ, రజిత, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఎంపీపీ సునీతపై హత్యాయత్నం

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఎంపీపీ కేతపాక సునీతపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన సమీప బంధువు కోర్నెల్ ఆమెపై కత్తితో దాడికి యత్నించారు. మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి కోర్నెలు మేనకోడలు శారీ ఫంక్షన్‌జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కుటుంబీకులతో పాటు ఆమె బంధువులు కూడా వెళ్లారు. అయితే అక్కడ కోర్నెల్‌కు ఎంపీపీ బంధువుకు గొడవ జరిగింది. దీనిని అవమానకరంగా భావించిన కోర్నెలు తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీపీ ఇంటికి వచ్చి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ఇరుర్గాల మధ్యగొడవ జరిగింది. ఈ ఘటనలో కోర్నెలుకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎం తరలించారు. కాగా, ఎంపీపీ సునీతతో పాటు ఆమె భర్త రాజు మరో ఆరుగురు తనపై దాడి చేశారని కోర్నెల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై కత్తితో దాడి చేశారని కోర్నెల్‌తో పాటు మరో ఇద్దరిపై ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్

- త్రివర్ణ ఇడ్లీ..పూరీ



ఉడిపి హోటల్‌లోని త్రివర్ణ ఇడ్లీ



మూడు రంగుల్లో పూరీ

పరకాల: ఒక్కొక్కరు ఒక్కో రకమైన దేశాభిమానం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని శ్రీరామ ఉడిపి హోటల్ యాజమాని జాతీయ పతాకాలు, బెలూన్లతో అలంకరించడంతోపాటు మూడు రంగుల ఇడ్లీ..పూరీలతో కస్టమర్లను ఆకట్టుకున్నాడు. పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్ అంటూ కస్టమర్లు హాయిగా తినేశారు.

కోర్టులో జెండావందనం..



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, పాల్గొన్న న్యాయమూర్తులు, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు. -వరంగల్ లీగల్



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వరంగల్ జిల్లా న్యాయమూర్తి కె.రాధాదేవి, న్యాయమూర్తులు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, కార్యదర్శి యాకస్వామి, సిబ్బంది తదితరులు. -వరంగల్ లీగల్